
ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

బుధవారం | జులై 22, 2026 | సంపుటి : 7 | సంచిక : 47 | పేజీలు : 2



## విద్యార్థులను రెచ్చగొట్టొద్దు

### నీట్ లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం: ప్రధాని మోదీ



**ఢిల్లీ, ఆయుధం:** నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. పేపర్ లీక్ ఘోర పాపమని, ఇలాంటివి మళ్లీ జరగకూడదని ఆయన వ్యాఖ్యానించారు. బాధ్యులకు కఠిన శిక్ష విధించాలని, ఇలాంటి లీక్ లను నివారించడం జాతీయ బాధ్యత అని పేర్కొన్నారు. 'మంగళ్ మిలన్' పేరిట మంగళవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఈ మేరకు ప్రధాని మాట్లాడారు. ఆయన మాట్లాడిన అంశాలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. "పార్లమెంట్ నిర్మాణాత్మక చర్చలు జరిగేలా విపక్షాలు సహకరించాలి. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చు. కానీ దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంపీలందరిపై ఉంది" అని ప్రధాని సూచించారు. "పిల్లలను రెచ్చగొట్టొద్దు. తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభం. కానీ తిరిగి సరైన మార్గంలోకి రావడం చాలా కష్టం. వారు సరైన మార్గంలో వెళ్లేలా చూసుకోవడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు.



■ ప్రధాని మోదీ ఇంటి ముందు కాంగ్రెస్ ధర్నా

## మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలి

■ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి ■ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ

**ఢిల్లీ, ఆయుధం:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై ఢిల్లీలో ఆందోళన చేసిన విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా కాంగ్రెస్ నేతలు ప్రధాని మోదీ నివాసం వద్ద ధర్నాకు దిగారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే సహా అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ముఖ్యనేతలు ప్రధాని నివాసం వద్ద బైఠాయించి నిరసన తెలియజేశారు. అంతకుముందు దేశంలోని యువత పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం సరికాదని రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశంలో యువతకు అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయని, వారికి ఉన్న ఏకైక మార్గమైన పోటీ పరీక్షల వ్యవస్థను సైతం నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళనల్లో గాయపడి రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను రాహుల్ పరామర్శించారు. ఢిల్లీలో విద్యార్థులపై దాడి ఘటనపై ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని రాహుల్ ప్రశ్నించారు. ఈ ఘటనపై ప్రధాని వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత్ లో తమకు భవిష్యత్తే లేదన్న విద్యార్థుల ఆవేదన పూర్తిగా న్యాయమైనదేనని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ నేతలతో జితేంద్ర సింగ్ చర్చ**

మోదీ ఇంటి ముందు కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ నేతలు చేతులకు తాళ్లు కట్టుకొని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని అక్కడి నుంచి తరలిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తమ వాదనను పార్లమెంటులో ఆలకించడం లేదని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. రహదారులపైకి వచ్చి ఆందోళన చేస్తుంటే పోలీసులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలతో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చర్చలు జరుపుతున్నారు. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బలగాలను మోహరించారు.

**విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారు!**

అంతకుముందు దేశంలో యువత పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం సరికాదని రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశంలో యువతకు అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయని, వారికి ఉన్న ఏకైక మార్గమైన పోటీ పరీక్షల వ్యవస్థను సైతం నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళనల్లో గాయపడి రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న (మిగతా 2 లో..)

## కళ్యాణం.. కమనీయం

### వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం

- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి కొండా సురేఖ
- హాజరైన సీఎం సతీమణి గీతారెడ్డి
- అమ్మవార్ల దయతో రాష్ట్రంలో వర్షా లు కురుస్తున్నాయని సంతోషం వ్యక్తం చేసిన మంత్రి

**హైదరాబాద్, ఆయుధం:** హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన వార్షిక కళ్యాణ మహోత్సవంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ తన కూతురు సుస్మితా పటేల్‌తో కలిసి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన మంత్రికి దేవాలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనాలు అందించారు.
అనంతరం తన కూతురితో కలిసి బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతా రెడ్డి ని మంత్రి కొండా సురేఖ మర్యాదపూర్వకంగా కలుసుకుని బోనాల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, బల్కంపేట అమ్మవారి కళ్యాణోత్సవానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి ప్రభుత్వం కట్టుదిట్టంగా చేసిన ఏర్పాట్ల మధ్య అమ్మవారిని సంతోషంగా దర్శించుకుంటున్నారని అన్నారు. పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, శివసత్తులకు అమ్మవార్ల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. "తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. నా కూతురు సుస్మితపటేల్ తో కలిసి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని అన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వరుణ యాగాలు, ప్రత్యేక పూజలతో అమ్మవార్ల అనుగ్రహం లభించి తెలంగాణపై వరుణదేవుడు వర్షాలతో కరుణ చూపుతున్నాడని భావిస్తున్నామని మంత్రి సురేఖ తెలిపారు. ఈ వర్షాలతో రాష్ట్రం పాడిపంటలతో సస్యశ్యామలంగా, సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులతో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని మంత్రి కొండా సురేఖ అమ్మవారిని ప్రార్థించారు. బల్కంపేట ఆలయ వైభవాన్ని అందించేందుకు దేవాదాయ శాఖ కట్టుబడి ఉందని మంత్రి సురేఖ తెలిపారు.




## ఘనంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బర్త్ డే

**హసన్‌పర్తి, ఆయుధం:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని హసన్‌పర్తిలో గల మహాలక్ష్మి బ్యాంకెట్ హాల్‌లో కాంగ్రెస్ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నర్సింహా రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు కేక్ కట్ చేసి, ఖర్గే కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గొడుగులను పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో స్థానిక కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత భవిష్యత్ కోసం రాహుల్ గాంధీ పోరాటం

■ సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆయుధం:** యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్‌కి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.







### వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు

## ప్రత్యేక కార్యాచరణ

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఎల్‌నీనో ప్రభావం, వర్షా భావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమీక్ష

**హన్మకొండ, ఆయుధం:** రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.
మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రవాణా & బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు.
దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

**ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను సన్నద్ధం చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశు సంవర్ధక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు.



## ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

■ రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్

**హనుమకొండ, ఆయుధం:** రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి అదనపు కార్యదర్శి డా ఇలంబర్తి, శాంతి భద్రతల

మిగతా2లో..




### ఉగ్రా నిత్యా అలంకరణలో

## అమ్మవారు

### ఏడో రోజు శాకంభరీ ఉత్సవాలు

వరంగల్ మహానగరంలో పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు ఏడవ రోజుకు చేరుకున్నాయి.



## ఈజీఎస్‌లో ఎన్ని పనిదినాలు కల్పించారు?

- ఎంపీ డా. కడియం కావ్య
- ఉపాధి హామీ పథకం అమలుపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ

## మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి..)

విద్యార్థులను రాహుల్ పరామర్శించారు. ఢిల్లీలో విద్యార్థులపై దాడి ఘటనపై ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని రాహుల్ ప్రశ్నించారు. ఈ ఘటనపై ప్రధాని వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత్ లో తమకు భవిష్యత్తే లేదన్న విద్యార్థుల ఆవేదన పూర్తిగా న్యాయమైనదేనని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

**అరెస్ట్ అయినవారి జాబితా కావాలి!**

మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు చేపట్టిన నేపథ్యంలో, పోలీసులు అరెస్టు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నిరసనకారుల జాబితాను విడుదల చేయాలని ఆప్ అధినేత కేజ్రీవాల్ ఢిల్లీ పోలీసులను కోరారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీ డీసీపీకి ఆయన ఓ లేఖ రాశారు. చాలా మందిపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే అదుపులోకి తీసుకున్నట్లు తనకు తెలిసిందని అన్నారు. అందు వల్ల బాధితులకు న్యాయ సహాయం చేసేందుకు వీలుగా ఎఫ్ఐఆర్ జాబితాను, అరెస్టు చేసిన నిరసనకారుల వివరాలను తక్షణం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## ఉద్యోగుల సమస్యల పరిష్కారం
# టీఎన్జీవోస్‌తోనే సాధ్యం

- **యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్**

**హనుమకొండ, ఆయుధం:** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం టీఎన్జీవోస్‌తోనే సాధ్యమని యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని రహదారులు, భవనాల శాఖ కార్యాలయంలో ఉద్యోగుల నుంచి టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్, అసోసియేట్ అధ్యక్షులు వేణుగోపాల్, కోశాధికారి రాజేష్, కేంద్ర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాము నాయక్, జిల్లా బాధ్యులు సురేష్, బాబు, మహబూబ్, ఫోరమ్ అధ్యక్షులు యూనస్ ఖాన్, విక్టర్, నిఖిల్, ఆర్ అండ్ బి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## చావు కాదు.. రేవు చేరుకో

- **బలవన్మరణాల బలిపీఠం భారత్ కాకూడదు**
- **ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్**

**హనుమకొండ, ఆయుధం:** జీవితం జీవించ దానికే, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైతే నష్టపడి ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని, వైఫల్యాలను వెక్కిరించి అహుయిత్యాల ఆలోచనను మానుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగిన మనిషి పరిపూర్ణుడు అవుతాడని ఆత్మహత్య నివారణ కమిటీ చైర్మన్, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీ గ్రౌండ్ లో ఉమ్మడి వరంగల్ ఖమ్మం జిల్లాల ఎన్‌సీసీ విద్యార్థులకు జరుగుతున్న పదవ తెలంగాణ బెటాలియన్ వారి కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపు 4 (CATC 4) లో జరిగిన ఆత్మహత్యల నివారణ సదస్సు క్యాంపు కమాండెంట్ ఎస్.ఎస్ .రామదుర్గ ఆదేశాల మేరకు డిప్యూటీ కమాండెంట్ రవి సుత్రావే ఆధ్వర్యంలో జరిగినది. సుబేదార్ మేజర్ జయరామ్ సింగ్ పరియం క్యాంపు అడ్జుటెంట్ కెప్టెన్ సతీష్ సమన్వయకర్తలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఆత్మహత్యల ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల, సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలని, తనకి ఎవరూ లేరనే, ఆగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలని, కష్టాల్లో ఉన్న వ్యక్తికి తనకు ఉన్న అన్నిదారులు మూసుకుపోయినప్పుడే ఆత్మహత్య ప్రయత్నం అనే దారి తెరుచుకుంటుందని, ఆ ప్రమాదకర క్షణంలో మేమున్నామంటూ భరోసానిస్తే బయటపడతారని, రైతులు తాను పండించిన పంట చేతికి అందే సమయంలో గిట్టుబాటు ధర లేక, ప్రపంచానికి అన్నం పెట్టే తనకే అప్పుల బాధతో అవమానం జరగడంతో ఆత్మాభిమానాన్ని చంపుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మహత్యలు చేసుకోవడాని, కష్టాల ను ఎదురించి ముందుకు సాగుతామని 600 మంది ఎన్సీసీ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆత్మహత్యల నివారణ కమిటీ ప్రతినిధులు గల్లేపల్లి విద్యాసాగర్, బాబు సుధాకర్, సీనియర్ వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ లతోపాటు JCO రాజేంద్రన్, లెఫ్టినెంట్ గణేష్, జీవన్, కెప్టెన్ సదానందం మరియు ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల NCC క్యాండిడేట్స్ సుమారు 600 మంది పాల్గొన్నారు.

## హనుమకొండ అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద విద్యార్థుల నిరసన



**హనుమకొండ, ఆయుధం:** న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిన్న నిర్వహించిన "చలో పార్లమెంట్" కార్యక్రమంలో విద్యార్థులు, యువజన సంఘాల నాయకులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడం, వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్ ప్రయోగించడాన్ని నిరసిస్తూ హనుమకొండ అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా AIYF జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ..విద్యార్థులు తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిర్వహించిన "చలో పార్లమెంట్" కార్యక్రమంపై పోలీసులతో దాడి చేయించడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం, వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్ ప్రయోగించడం అత్యంత దారుణమని, ఈ ఘటనలో పలువురు విద్యార్థులు, యువకులకు తీవ్రంగా గాయపడటం బాధాకరమని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డా. ఖాద్రి డిమాండ్ చేశారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయక పోవడం, విద్యా రంగంలో ప్రైవేటీకరణ, ఫీజుల భారాలు, పరీక్షల నిర్వహణలో అవకతవకలు వంటి సమస్యలపై విద్యార్థులు, యువత ఆందోళన చేస్తున్నారని తెలిపారు. వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన కేంద్ర ప్రభుత్వం లాఠీలు, వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్‌తో సమాధానం చెప్పడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. NEET ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డా. ఖాద్రి డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగిన పోలీసు దమనకాండకు కేంద్ర ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని, గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో PDSU యునైటెడ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుర్గం సారయ్య, వరంగల్ సామాజిక కార్యకర్త ఎం.ఏ. సమద్, AIYF హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ నాయక్, రవి, మహేష్, కరీం తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రా నిత్యా అలంకరణలో అమ్మవారు

- **ఏడో రోజు శాకంభరీ ఉత్సవాలు**

**వరంగల్, ఆయుధం:** వరంగల్ మహానగరంలో పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం పూర్తిచేసిన పిమ్మట అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి ఉగ్రా నిత్యా గాను షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని శివదూతీమాత గాను అలంకరించి పూజారాధనలు నిర్వహించారు.





ఏ తిథికి ఏ దేవత అధిదేవతో ఆ దేవతను ఆరాధించడం వల్ల ఆ రోజంతా శుభప్రదమౌతుందని జ్యోతిశ్శాస్త్రం చెప్పడం వల్ల ఈ రోజు మంగళవారం కావడం వల్ల భక్తులందరికీ ఈ రోజు శుభప్రదం కావాలని ఆలయంలో అర్చకులు ముందుగా సుబ్రహ్మణ్య ఆరాధన జరిపారు. దశమహావిద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి ఏడవ రోజుకు అధిదేవత ఉగ్రా మాత, ఈమెను ఉగ్రతారా అని కూడా అంటారు. ఈమెయే శ్రీరాముని చైతన్య శక్తిగా తంత్రాలు చెబుతున్నాయి. ఈమెను ఉపాసించిన వారికి సామ్రాజ్యైశ్వర్యము, శత్రువిజయము, కలుగుతాయి. అట్లాగే షోడశీ క్రమాన్ని అనుసరించి ఏడవ రోజుకు అధిదేవత శివదూతి అమ్మవారు. అమ్మవారి జ్ఞానశక్తిని శివదూతిమాతగా అలంకరించి ఆరాధించారు. అమ్మవారు రాక్షసులను పాతాళానికి వెళ్ళిపోయి జీవించమని తనమాటగా చెప్పమని శంకరుని శుంభాసురుని దగ్గరికి దూతగా పంపుతుంది. అప్పటి నుండి అమ్మవారిని శివదూతిగా శాస్త్రాలు కీర్తించాయి. శివదూతి అమ్మవారిని సేవించడం వల్ల అపరిష్కృతంగా ఉన్న వ్యవహారాలన్నీ చక్కబడతాయని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు.

**ఎమ్మెల్యే నాయిని పూజలు**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని



రాజేందర్ రెడ్డి తన జన్మోత్సవం సందర్భంగా కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి అమ్మవారికి విశేష అభిషేక, అర్చనాదులు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ఎం.ఎల్.ఏ నాయిని రాజేందర్ రెడ్డి దంపతులకు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారికి శేషవస్త్రములు బహూకరించారు. అనంతరం వరంగల్ పోలీస్ కమీషనర్ శ్వేత రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం డోర్నకల్ ఎమ్మెల్యే డా. జటోత్ రామ చందర్ నాయక్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు. పూజానంతం అర్చకులు వేదాశీర్వచనం నిర్వహించి శేషవస్త్రాలు అందజేశారు. సుమారు 10 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా దధ్యోదనం, శనగపిండితో ప్రత్యేకంగా చేసిన హల్వాను భక్తులకు వితరణ జరిపారు.

# మహిళా సంఘాల ఏర్పాటుపై దృష్టి సారించాలి

- **ఏఎండి యాదగిరి రావు**
- **ఉమ్మడి వరంగల్ జిల్లా మెప్మా అధికారులతో సమావేశం**
- **ఎస్ హెచ్ జీ సంఘాల ఆదాయ, వ్యయాల నిర్వహణకు ఉచితంగా పుస్తకాల అందజేత**




**వరంగల్, ఆయుధం:** మెప్మా అధికారులు నూతన మహిళా సంఘాల(ఎస్ హెచ్ జీ) ఏర్పాటు పై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మెప్మా అడిషనల్ మిషన్ డైరెక్టర్ (ఏఎండి)యాదగిరి రావు అభిప్రాయపడ్డారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మెప్మా అధికారులతో వివిధ అంశాలపై నిర్వహించిన సమావేశంలో ఏఎండి పాల్గొని సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న మహిళా సంఘాలు కాకుండా అదనంగా 30% సంఘాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని.. ఇందుకోసం మెప్మా అధికారులు ప్రత్యేక కార్యాచరణ తో ముందుకు వెళ్లాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 2 లక్షల 2 వేల ఎస్ హెచ్ జీ గ్రూపు లు మాత్రమే ఉన్నాయని, రాష్ట్ర జనాభా తో పోలిస్తే ఈ గ్రూపుల సంఖ్య అత్యల్పమని, ఎస్ హెచ్ జీ సంఘాల ఆదాయ వ్యయాల నిర్వహణకు 33 రకాల పుస్తకాలు అవసరం అని రాష్ట్ర అవతరణకు ముందు 2011 లో ఇట్టి పుస్తకాలను అందజేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళిన నేపథ్యంలో ఎస్ హెచ్ జీ సంఘాలకు ఉచితంగా అందజేయడానికి రూ.30 కోట్లను కేటాయించి వాటిని ఎస్ హెచ్ జీ గ్రూపు లకు ఉచితం గా అందించాలని ఆదేశించారని తెలిపారు. పుస్తకాలను త్వరలోనే అందజేస్తామని అన్నారు. పట్టణ ప్రాంతాల్లోని స్లం ఏరియాల్లో నివసిస్తున్న పేద పిల్లలకు అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా టౌన్ లెవెల్ టాస్క్ ఫోర్స్ (టి ఎల్ టి) బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లా ను ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్ )లో భాగంగా జిల్లా కలెక్టర్ లు చైర్మెన్ లుగా, సంబంధిత నగరాల కమిషనర్ లు వైస్ చైర్మెన్ లు గా, మెప్మా అధికారులు, సిబ్బంది తో కమిటీలు వేయడం జరుగుతుందని అన్నారు. అట్టడుగు స్థాయిలో ఉండే పిల్లలకు అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందించడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయుక్తం గా ఉంటుందని ఏ ఎం డి తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వ రావు, మెప్మా పిడి రాజేశ్వర్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, డిఎంసిలు రజిత రాణి, రేణుక, విజయ, రాజేశ్వరి ఇంచార్జి డిఎంసి హర్షవర్ధన్, ఏడిఎంసిలు వహీద, సతీష్ టిఏంసిలు రమేష్, వెంకట్ రెడ్డి, సిఓలు సకినాల రమేష్, ప్రవీణ్, శ్రీలత, రమాదేవి, రజిత తదితరులు పాల్గొన్నారు.

# 24లోగా 'ఎస్ఐఆర్' పూర్తి చేయాలి


- **రాష్ట్రంలో పరకాలను తొలి స్థానంలో నిలపాలి**
- **ఎస్ఐఆర్‌లో రాష్ట్రంలో 4వ స్థానంలో పరకాల**
- **ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**హనుమకొండ, ఆయుధం;** ఈనెల 24వ తేదీలోగా పరకాలలో ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసి రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలపాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఎస్ఐఆర్ ప్రక్రియ తీరుపై పరకాల నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇన్చార్జిలతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా నల్గొండ ఎమ్మెల్సీ, వరంగల్ పార్లమెంట్ ఎస్ఐఆర్ పొలిటికల్ ఇంచార్జ్ శంకర్ నాయక్, పార్లమెంట్ అబ్జర్వర్ నాసిర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, ఎండి.అయుబ్ పాల్గొన్నారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించి, దిశా నిర్దేశం చేశారు. 100% శాతం పూర్తయిన బూత్ లెవల్ ఏజెంట్లను అభినందించారు. రాష్ట్రంలో పరకాల నియోజకవర్గం ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో 4 వ స్థానంలో ఉన్నదని, ఇందుకు కృషిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తను వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రజాస్వామ్య పరిరక్షణకు బిఎల్ఏల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని అన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని, ఈనెల 24వ తేదీలోగా 100% పూర్తి చేసి పరకాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని వారు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న పార్టీ నాయకత్వం ఒక టీంగా పని చేస్తున్నదని, ఈ టీం రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పునాదిగా నిలుస్తుందని అన్నారు. ఓటర్ వెరిఫికేషన్ లో ఎలాంటి అవకతవతలు జరగకుండా ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈజీఎస్‌లో ఎన్ని పని దినాలు కల్పించారు?

- **ఎంపీ డా. కడియం కావ్య**
- **ఉపాధి హామీ పథకం అమలుపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ**



**హనుమకొండ, ఆయుధం:** వరంగల్ జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) అమలు, ఉపాధి కల్పన, వేతనాల చెల్లింపుల స్థితిగతుల పై వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్ లో ప్రశ్నించారు. ఉపాధి కోరిన కుటుంబాలకు ఎంత మేర పని కల్పించారు? సగటున ఎన్ని పనిదినాలు లభించాయి? వేతనాల చెల్లింపుల్లో ఏమైనా బకాయిలు ఉన్నాయా? అనే అంశాలపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖను ఆమె వివరణ కోరారు.

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాస్వాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, వరంగల్ జిల్లాలో 202425 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కోరిన అర్హ కుటుంబాల్లో 99.99 శాతం మందికి, 202526 ఆర్థిక సంవత్సరంలో 99.97 శాతం మందికి పని కల్పించారు. ఒక్కో కుటుంబానికి సగటున 202425లో 41.12 పనిదినాలు, 202526లో 27.89 పనిదినాలు లభించాయన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించడంలో వరంగల్ జిల్లా మెరుగైన ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రజల సమస్యలను పార్లమెంట్ వేదికగా ప్రస్తావిస్తూ, వారి హక్కులు, సంక్షేమ పథకాల అమలుపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. వేతనాల చెల్లింపుల విషయంలో కూడా వరంగల్ జిల్లాలో ఎలాంటి పెండింగ్ బకాయిలు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడం సానుకూల పరిణామమని కడియం కావ్య పేర్కొన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా కూలీల ఖాతాల్లోకి నేరుగా వేతనాలు జమ కావడం వల్ల పారదర్శకత పెరిగిందన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టండి

- **మాన్ సూన్ బృందాల సహకారం తో పని చేయండి**
- **ప్రధాన రహదారులు పరిశుభ్రత అత్యవసరం**
- **బల్దియా కమిషనర్ టి.వెంకన్న**



**వరంగల్, ఆయుధం:** విస్తృతంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. నగర పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన తిరుమల బార్ జంక్షన్, ఎన్ జీ ఓస్ రోడ్డు, ఎస్ బిహెచ్ కాలనీ, రామకృష్ణ కాలనీ, కాకతీయ కాలనీ, బొంది వాగు, శివ నగర్, మైసయ్య నగర్, సాయి గణేష్ నగర్ వడ్డేపల్లి చెరువు,12 మోరీలు ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా ఇంజనీరింగ్ కు చెందిన మాన్ సూన్ టీమ్స్ సహకారంతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే తొలగించాలని చిన్నచిన్న గల్లీలోని డ్రైన్ లో నీరు నిలిచి ఉండకుండా అవసరం మేరకు డీ సిల్టింగ్ ప్రక్రియ చేపట్టి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ప్రధాన రోడ్లపై శానిటేషన్ పక్కాగా జరిగేలా చూడాలని డివైడర్ ల మధ్యలో చెత్త, మొక్కల ఆకులు పేరుకు పోకుండా తొలగించాలని వీటితో పాటు లింక్ రోడ్ ల శుభ్రత పై దృష్టి సారించాలని స్వీపింగ్ మిషన్ లు మరమ్మతులకు గురి కాకుండా చూడడంతో పాటు అట్టి మిషన్ పని తీరు పై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజారెడ్డి, ఏంహెచ్ఓ డా.రాజేష్, శానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను, తదితరులు ఉన్నారు.

## ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

(మొదటి పేజీ తరువాయి..)

అధికారులు, రవాణా, ఆర్ అండ్ బీ , జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్, రవాణా, రహదారులు భవనాల శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలు ప్రతినెల నిర్వహించాలని తెలిపారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని, రహదారులపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ లను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని అంబులెన్స్ లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695